“జల్ సంచయ్ జల్ భాగీదారి” కార్యక్రమం 2

Neti Velugu
# నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

## రిపోర్టర్లు కావలెను

నేటి వెలుగు తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు
రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో
మరియు మండల హెడ్ క్వార్టర్స్ లో రిపోర్టర్లు కావాలి
ఆసక్తి గలవారు ఈ నెంబర్కు సంప్రదించండి:-
సంపాదకులు పామనగుండ్ల నవీన్ కుమార్ గౌడ్
9553276552.

నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 61 | జూన్ 2 మంగళవారం 2026 | పేజీలు : 4 | వెల రూ. 4.00/-
NALGONDA | VOL:3 | ISSUE: 61 | PAGES:4 | TUESDAY JUNE 2 2026 | Rs. 4:00



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

# నెల రోజుల్లోనే..
# ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేలా

## కొత్త సాంకేతికత తీసుకువస్తాం: రేవంత్ రెడ్డి




- కొమురంభీం జిల్లాలో సీఎం పర్యటన
- కొరెగు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న సీఎం
- రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్ ఆవిష్కరణ

**ప్రతి ఇంటా ఆశల వెలుగు..**
**ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం వేగవంతం..!**

నెల రోజుల్లోనే ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేలా కొత్త సాంకేతికతను తీసుకువస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కొమురంభీమ్ అసిఫాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి ఈరోజు పర్యటించారు. కోశారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన వారందరూ ఇళ్లను నిర్మించుకోవాలని అన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొదటి విడతలో 4 లక్షల 50 వేల ఇళ్లను ఇచ్చినట్లు చెప్పారు. త్వరలో రాష్ట్రం మొత్తంలో ప్రారంభించే ఇళ్లకు ఆదివాసీ ప్రాంతం నుంచే లక్ష ఇళ్లను ప్రారంభిస్తామని అన్నారు.

## పశ్చిమాసియాలో శాంతికి ‘భారత్’ ఒక్కటే మార్గం: ఇజ్రాయెల్

- పశ్చిమాసియా స్థిరత్వంలో భారత్‌ది కీలక పాత్రన్న ఇజ్రాయెల్ రాయబారి
- భారత్ ఆర్థిక వృద్ధి ద్వారా ఈ ప్రాంతానికి ట్రిలియన్ డాలర్ల లబ్ధి
- భారతీయుల్లో ఇజ్రాయెల్ పట్ల ‘క్రేజీ లవ్’ ఉందన్న ప్రధాని నెతన్యాహు

భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి భారతదేశం అత్యంత కీలకమైన పాత్ర పోషించాల్సి ఉందని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ అభిప్రాయపడ్డారు. వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా, బలమైన వాణిజ్య భాగస్వామిగా (మిగతా 2వ పేజీలో..)



## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోలీసులకు పతకాలు

- విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ చీఫ్‌కు సర్వోన్నత పోలీసు పతకం
- భద్రాద్రి కొత్తగూడెం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రవి, చెర్ల సీఐ రాజులకు శౌర్య పతకాలు
- 16 మందికి మహోన్నత సేవా పతకాలు




## మీటింగ్ ల నుంచి జనం వెళ్లిపోకుండా కందకాలు తవ్వారు: చామవరం సభలో చంద్రబాబు

- తుని నియోజకవర్గం చామవరంలో ‘పేదల సేవలో’ సభ
- గత ప్రభుత్వంపై విరుచుకుపడిన సీఎం చంద్రబాబు
- నాడు భయానక వాతావరణం ఉండేదని విమర్శలు
- బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేదని వ్యాఖ్యలు



విధ్వంసకర పాలన నుంచి జూన్ 4వ తేదీన ఓటుతో విముక్తి కల్పించారని వెల్లడి (మిగతా 2వ పేజీలో..)

హైదరాబాద్ సభపై పవన్ కల్యాణ్‌కు పొన్నం ప్రభాకర్ అల్టిమేటం.. క్షమాపణ చెప్పాకే అడుగుపెట్టాలని డిమాండ్!

## హైదరాబాద్‌లో జనసేన ‘నవనిర్మాణ సభ’

- తెలంగాణ ఏర్పాటును పవన్ తీవ్రంగా వ్యతిరేకించారన్న పొన్నం
- హైదరాబాద్‌లోనే పవన్ ఎందుకు సభ పెడుతున్నారని ప్రశ్న



హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన ‘నవనిర్మాణ సభ’పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే ఇక్కడ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును గతంలో పవన్ కల్యాణ్ తీవ్రంగా వ్యతిరేకించారని మంత్రి పొన్నం గుర్తుచేశారు.
(మిగతా 2వ పేజీలో..)

# "జల్ సంచయ్ జల్ భాగీదారి" కార్యక్రమం









**నల్గొండ జిల్లా జూన్ 01 నేటి వెలుగు ప్రతినిధి**

"జల్ సంచయ్ జల్ భాగీదారి" కార్యక్రమంలో నల్గొండ జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవడం పట్ల జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను అభినందించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఆయన వివిధ అంశాల పై నిర్వహించిన సమీక్ష సందర్భంగా "జల్ సంచాయ్ జన్ బాగిదారి" కార్యక్రమం కింద జిల్లాలో లక్ష ,50,000 పనులు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించగా, లక్ష ఇరవై తొమ్మిది వేల పనులను పూర్తి చేసి రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవడం జరిగిందని తెలిపారు. ఇందుకు కృషి చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, సిబ్బంది, జిల్లా పంచాయతీ అధికారి, ఇతర అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులను ఆయన అభినందించారు. అన్ని పథకాల అమలలో ఇదేవిధంగా అధికారులందరూ టీం వర్క్ చేసి జిల్లాను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని కోరారు. అలాగే ఈనెల 1 నుండి 5 వరకు " స్వచ్ఛ గావ్ సురక్ష జల్ వాయు" కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతున్నదని, ఈ కార్యక్రమ విజయవంథానికి జిల్లా అధికారులందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన "స్వచ్ఛ గావ్ సురక్ష జల్ వాయు" పై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా ఈ నెల 1 నుండి 12 వరకు పర్యావరణ వారోత్సవం నిర్వహించడం జరుగుతున్నదని, ఇందులో భాగంగా జూన్ 1న పర్యావరణంపై అవగాహన కల్పించడం , జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవం ,నాలుగున విద్యార్థులకు క్విజ్ కార్యక్రమాల నిర్వహణ, ఐదున పర్యావరణ దినోత్సవం, ఆరున ప్రకృతి కార్యక్రమాల నిర్వహణ, జూన్ 8న మౌలిక సౌకర్యాల కల్పన, 9న కమ్యూనిటీ పర్యావరణ కార్యక్రమాలు, 10న గ్రాస్ రూట్ పర్యావరణ కార్యక్రమాలు, 11న జూ మరియు వన్యప్రాణులు వన దర్శిని కార్యక్రమం, 12న వీటన్నిటిపై సమీక్ష ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి నూతనంగా ప్రవేశపెట్టనున్న ఆరోగ్య కార్డులు, సర్వీస్ రిజిస్టర్ల ఆన్లైన్ అప్డేషన్ కు సంబంధించి అన్ని శాఖల అధికారులు తక్షణమే ఐ ఎం ఎఫ్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులన్నీ జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కాగా ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 43, ఇతర శాఖలకు 75 మొత్తం 118 ఫిర్యాదులు వచ్చాయి.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ ,జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిఎఫ్ఓ ఎస్. రాజశేఖర్, తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం పై రూపొందించిన గోడపత్రికను, అంతేకాక సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పై రూపొందించిన నూతన నియమాల గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం





## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు
## మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**నల్లగొండ పట్టణం జూన్ 01 నేటి వెలుగు ప్రతినిధి :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని నల్లగొండ నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారునల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని 5వ డివిజన్ రామ్ నగర్ లో మేడి లక్ష్మి-ఈదయ్య దంపతులు సోమవారం నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేశారు ఈ కార్యక్రమంలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ పున్న జ్ఞానేశ్వరి గణేష్ పాల్గొని ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకొని గృహప్రవేశం చేసిన దంపతులను అభినందించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూర అవుతాయని అన్నారుఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారుమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో నల్గొండ మాజీ జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్ పున్న గణేష్, రేఖల భద్రాద్రి, కోట శంకర్, యసిక అశోక్, మణి, సాయి, రాహుల్,సురేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారులి



## పోలీస్ గ్రీవెన్స్ డే లో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్..



**నల్గొండ జిల్లా జూన్ 01 నేటి వెలుగు ప్రతినిధి**

నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 46 మంది బాధితులు తమ సమస్యలు, భూ వివాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు మరియు ఇతర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను ఎస్పీ కి అందజేశారు.ప్రతి ఫిర్యాదును జిల్లా ఎస్పీ పరిశీలించి, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యలను త్వరితగతిన చట్టప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఫిర్యాదుదారులతో మాట్లాడిన ఎస్పీ , ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా ముందుకు రావాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ ను త్వరగా పూర్తి చయాలి..

**రాష్ట్ర నీటిపారుదల మరియు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**సూర్యాపేట జిల్లా నాగారం మండలం జూన్ 01 నేటి వెలుగు ప్రతినిధి**



జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా ముగించాలని రాష్ట్ర నీటిపారుదల మరియు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం నాగారం మండలం ఫణిగిరి ఐకెపి సెంటర్ ను తనిఖీ చేశారు ఈ సెంటర్లో మొత్తం 1571 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చినదని, ఇందులో ఇప్పటివరకు 1488 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగినదని మిగిలిన ధాన్యాన్ని రెండు మూడు రోజుల్లో పూర్తి చేస్తామని మండల ఏపీఎం వెంకట రెడ్డి మంత్రికి వివరించారు. తదుపరి మంత్రి మాట్లాడుతూ నాగారం మండలంలోని మహిళలకు మహిళా శక్తి పథకం కింద పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్ లు, ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన బస్సులు మంజూరు చేయడం జరుగుతుందని మండలంలోని గ్రామపంచాయతీలో మహిళా శక్తి భవనాలు కట్టించడం జరుగుతుందని మహిళలను కోటీశ్వరులుగా చేయటమే ఈ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, డి ఆర్ డి ఏ పి డి సన్యాసయ్య, డీఎస్ఓ మోహన్ బాబు, సర్వోత్తమ్ రెడ్డి, మండల ఏపిఎం వెంకటరెడ్డి ఐకేపీ మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ టౌన్ ప్లానింగ్ అధికారిపై కలెక్టర్ కు ఫిర్యాదు

**నల్లగొండ పట్టణం జూన్ 01 నేటి వెలుగు ప్రతినిధి**

నల్గొండ మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారిపై సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే లో షబానా ఫిర్యాదు చేశారు. వివరాలలో కి వెళ్తే నల్గొండ మున్సిపాలిటీ పరిధిలో గొల్లగూడెం రెవెన్యూ పరిధిలో రాంనగర్ సర్వే నెంబర్ 231 లో 225 గజాల ప్లాట్ కొనుగోలు చేసారు అట్టి ప్లాట్ ముందర ఉన్న 25 ఫీట్ల రోడ్డును మాజీ నాక్సలైట్ వాసం తుల్సమ్మ కబ్జా చేసుకొని సంప్ నిర్మాణం చేపట్టింది అట్టి సంప్ నిర్మాణం జనవరి ఆరో తేదీన పిర్యాదు చేయగా అప్పటి మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేయగా కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారి కు ఎంక్వరీ కు రాసారు బదిలీ పై కమిషనర్ వెళ్లగా నూతన కమిషనర్ మరల కలిసి పిర్యాదు చేయగా ఇప్పటి కమిషనర్ మరల ఎంక్వరి కు చేయమని చెప్పగా అట్టి ప్రాంతాన్ని పరిశీలించి ఇప్పటి వరకు చర్యలు తీసుకొక పోవడమే కాకుండా వల్గర్ గా సమాధానం చెప్తూ సమస్యని దాటావేస్తూ నిర్లక్ష్యం చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోని మాకు రోడ్డు కబ్జా కాకుండా కాపాడాలని బాధిత మహిళా గ్రీవెన్స్ డే లో పిర్యాదు చేసారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా పోలీసులకు పతకాలు

**(మొదటి పేజీ తరువాయి)**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, ఉత్తమ సేవలు అందించిన 632 మంది పోలీసులు, అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. ఈ మేరకు ఈరోజు వారి పేర్లను ప్రకటించింది. విశిష్ఠ, అత్యుత్తమ మరియు ఉత్తమ సేవలకు గుర్తింపుగా, పోలీస్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, అవినీతి నిరోధక బ్యూరో, ప్రత్యేక రక్షణ దళం, అగ్నిమాపక సేవల విభాగాలకు చెందిన సిబ్బందిని వివిధ పతకాలకు ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ చీఫ్ ప్రతాప్‌కు సీఎం సర్వోన్నత పోలీసు పతకం దక్కింది. భద్రాద్రి కొత్తగూడెం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రవి, చెర్ల సీఐ రాజులకు తెలంగాణ పోలీస్ శౌర్య పతకాలను ప్రకటించారు. ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ సంపత్, గ్రేహౌండ్స్‌లోని మరో ఏడుగురిని శౌర్య పతకాలు వరించాయి. 16 మందికి మహోన్నత సేవా పతకాలు, 94 మందికి ఉత్తమ సేవా పతకాలు, 50 మంది కఠిన సేవా పతకాలు, మరో 461 మంది సేవా పతకాలు అందుకోనున్నారు.

# పశ్చిమాసియాలో శాంతికి 'భారత్' ఒక్కటే మార్గం: ఇజ్రాయెల్

**(మొదటి పేజీ తరువాయి)**

భారత్ ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ట్రిలియన్ డాలర్ల వ్యాపారానికి వేదిక

ప్రపంచంలోని అన్ని ప్రధాన వాణిజ్య కూటములతో భారత్ చారిత్రాత్మక ఒప్పందాలను కుదుర్చుకుందని రూవెన్ అజర్ గుర్తుచేశారు. "పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పి, తీవ్రవాద శక్తులను అణచివేయగలిగితే.. భారత్ ద్వారా వచ్చే ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు, వస్తు రవాణా వల్ల ఇక్కడి దేశాలన్నీ అద్భుతమైన సంపదను, శ్రేయస్సును అనుభవిస్తాయి. అందుకే ఈ ప్రాంత స్థిరత్వంలో ఢిల్లీ పాత్ర ఎంతో కీలకం" అని ఆయన పేర్కొన్నారు.

భారతీయుల్లో ఇజ్రాయెల్‌పై 'క్రేజీ లవ్'

ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన దౌత్య బంధాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్‌పై విమర్శలు వస్తున్నప్పటికీ.. భారత్ నుంచి మాత్రం తమకు అచంచలమైన ప్రజా మద్దతు లభిస్తోందని చెప్పారు. "భారత్‌లో ఇజ్రాయెల్ పట్ల ఒక అద్భుతమైన క్రేజీ లవ్ ఉంది. ప్రపంచంలో మరే దేశం నుంచి లేనంత మంది ఫాలోవర్లు నాకు ఒక్క భారతదేశం నుంచే ఉన్నారు" అని నెతన్యాహు సంతోషం వ్యక్తం చేశారు.

## హైదరాబాద్ సభపై పవన్ కల్యాణ్‌కు పొన్నం ప్రభాకర్ అల్టిమేటం.. క్షమాపణ చెప్పాకే అడుగుపెట్టాలని డిమాండ్!

**(మొదటి పేజీ తరువాయి)**

రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం ముట్టలేదని పవన్ చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ... అసలు ఏ నైతిక హక్కుతో ఆయన హైదరాబాద్‌లో ఇంత పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు."తెలంగాణ దృష్టి పడితే కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతాయి" అంటూ గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, భావాలను తీవ్రంగా గాయపరిచాయని పొన్నం మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై పవన్ సమాధానం చెప్పి తీరాలన్నారు. తెలంగాణలో రాజకీయ ప్రయోజనాల కోసం, ఇక్కడి ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ద్వేషాన్ని నింపేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీని వెనుక బీజేపీతో పవన్‌కు ఉన్న 'తెరవెనుక ఒప్పందం' స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ సభ నిజంగా అభివృద్ధి కోసమే అయితే గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో పెట్టుకోవచ్చు కదా... కేవలం హైదరాబాద్‌లోనే ఎందుకు పెడుతున్నారని మంత్రి ప్రశ్నించారు. ఏపీ ప్రజలు పవన్‌కు బాధ్యతాయుతమైన పదవి ఇచ్చారని, తెలంగాణ రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా... వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి ఆంధ్రప్రదేశ్ సమస్యలపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు. పవన్ గనుక క్షమాపణ చెప్పకపోతే తెలంగాణ ప్రజలు ఈ సభను తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించారు.

# తమిళనాడులో పోరు ఇక డీఎంకే, టీవీకే మధ్యే: సీఎం విజయ్

తమిళనాడులో రాజకీయ పోరు ఇకపై టీవీకే, డీఎంకే మధ్య మాత్రమేనని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ అన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత సోమవారం తొలిసారిగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కుటుంబ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారని ఆయన వ్యాఖ్యానించారు.తన పాలన ప్రజలందరి కోసం ఉంటుందని, రాష్ట్ర హక్కులు, లౌకికవాదం విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడబోమని హామీ ఇచ్చారు. "రాజకీయంగా చెబుతున్నా, ఇప్పుడు పోటీ కేవలం రెండు పార్టీల మధ్యే. ఒకటి డీఎంకే, మరొకటి టీవీకే. మధ్యలో ఇంకెవరికీ పాత్ర లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. తమ పార్టీపై వస్తున్న హార్స్ ట్రేడింగ్ ఆరోపణలను ఖండించిన విజయ్, అధికారం కోల్పోయిన డీఎంకే, అన్నాడీఎంకేలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. "ఇన్నేళ్లుగా మిమ్మల్ని మోసం చేస్తున్న వారిని కాదని, మీ కోసం పనిచేయడానికి వచ్చిన మీ విజయ్‌ను, మీ అన్నను, మీ తమ్ముడిని ముఖ్యమంత్రిగా కాదు, మీ మొదటి సేవకుడిగా ఎన్నుకున్నారు" అని అన్నారు. తాను అధికారంలోకి వచ్చి కొద్ది వారాలే అయినా, ఆరు నెలలు మౌనంగా ఉంటామని చెప్పిన వాళ్లు ఆరు రోజులు కూడా ఆగలేకపోయారని విమర్శించారు. చివరగా, తాను సూట్ ధరించడంపై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ, సూట్ ఎందుకు వేసుకోకూడదని ప్రశ్నించారు.

# ప్రజలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న నిడమానూరు ఎంపీడీవో హిమబిందు..

**వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్..**

**సంక్షేమ పథకం కోసం మందలిస్తే అవమానకర స్పందన..**

**పేదల సమస్యలు వినాల్సిన అధికారి.. ప్రశ్నిస్తే ఆగ్రహం ఎందుకు..?**

**ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరపాలంటూ ప్రజల విజ్ఞప్తి..**

**నల్లగొండ జిల్లా నిడమానూరు మండలం జూన్ 01 నేటి వెలుగు ప్రతినిధి**




నల్లగొండ జిల్లా నిడమానూరు మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు బాధ్యత వహిస్తున్న ఎంపీడీవో హిమబిందు వ్యవహార శైలిపై స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకం కోసం ఒక పేద కుటుంబం తరఫున ఫోన్ ద్వారా వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా, సమస్యను పూర్తిగా వినకుండానే అసహనంగా స్పందించారని, ఇష్టానుసారంగా మాట్లాడారని ఆరోపణలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేద కుటుంబాలకు చేరేలా చూడటం అధికారుల ప్రధాన బాధ్యత. అయితే పథకాల కోసం సంప్రదించిన ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించకుండా నిర్లక్ష్యంగా స్పందించడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పేద కుటుంబం సంక్షేమ పథకం కోసం సహాయం కోరితే సమస్యను పరిష్కరించే దిశగా స్పందించాల్సింది పోయి, వారిని నిరుత్సాహపరిచే విధంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారులు ప్రజల సేవ కోసం పనిచేయాల్సి ఉంటుంది. ప్రజలు తమ సమస్యలు, సందేహాలతో అధికారులను సంప్రదించడం సహజం. అలాంటి సమయంలో వారికి సరైన సమాచారం అందించడం, సమస్యలను వినడం, మార్గనిర్దేశం చేయడం అధికారుల విధి. కానీ ప్రశ్నలు అడిగినందుకే అసహనం వ్యక్తం చేయడం, ప్రజలతో కఠినంగా మాట్లాడడం వంటి ఘటనలు ప్రజల్లో ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ అనేక పేద కుటుంబాలు గృహ నిర్మాణ పథకాలు, పెన్షన్లు, రేషన్, ఉపాధి హామీ, ఇతర సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాయి. ప్రతి సంక్షేమ పథకం వెనుక ఒక కుటుంబం ఆశ, ఒక పేదవాడి భవిష్యత్తు, ఒక వృద్ధుడి అవసరం దాగి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో అధికారులు మరింత బాధ్యతతో, సహనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.ఈ అంశంలో ఎంపీడీవో హిమబిందుపై వ్యక్తిగత కక్షలు, రాజకీయ విభేదాలు లేదా ఇతర ప్రయోజనాలు ఏవీ లేవని, కేవలం ఒక పేద కుటుంబానికి సంబంధించిన ప్రభుత్వ సంక్షేమ పథకం గురించి అడిగిన సందర్భంలో ఎదురైన అనుభవాన్ని మాత్రమే ప్రజల ముందుకు తీసుకువస్తున్నామని బాధితులు చెబుతున్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్నదే తమ ఉద్దేశమని వారు స్పష్టం చేస్తున్నారు.ప్రజల పన్నుల డబ్బుతో జీతాలు పొందుతున్న అధికారులు ప్రజల పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజలను గౌరవించడం, వారి సమస్యలను ఓపికగా వినడం, సంక్షేమ పథకాలపై సరైన సమాచారం అందించడం ప్రతి ప్రభుత్వ అధికారికి కనీస బాధ్యత అని వారు గుర్తు చేస్తున్నారు.నిడమానూరు ఎంపీడీవో హిమబిందు వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పేదల సమస్యలను నిర్లక్ష్యం చేయడం, ప్రజలతో అనుచితంగా వ్యవహరించడం నిజమే అయితే సంబంధిత అధికారిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ప్రజలకు ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా చర్యలు చేపట్టి, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మీటింగ్ ల నుంచి జనం వెళ్లిపోకుండా కందకాలు తవ్వారు: చామవరం సభలో చంద్రబాబు

**(మొదటి పేజీ తరువాయి)**

**అది చరిత్రలో నిలిచిపోయే రోజన్న చంద్రబాబు**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భయానక వాతావరణం ఉండేదని, బహిరంగ సభలకు వచ్చిన ప్రజలు మధ్యలో వెళ్లిపోకుండా అడ్డుకోవడానికి ఏకంగా కందకాలు తవ్వి, ఫెన్సింగ్‌లు వేసి నిర్బంధించే దుస్థితి ఉండేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేదని వ్యాఖ్యానించారు. అలాంటి విధ్వంసకర పాలన నుంచి జూన్ 4వ తేదీన ప్రజలు తమ ఓటుతో రాష్ట్రానికి విముక్తి కల్పించారని, ఆ రోజు చరిత్రలో నిలిచిపోతుందని ఆయన అన్నారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో సోమవారం జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత పాలకులు బటన్ నొక్కి పైశాచిక ఆనందం పొందేవారని, ప్రజల కష్టసుఖాలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం ప్రజలతో మమేకమవుతూ, నేరుగా వారి వద్దకే వెళ్లి సేవలు అందిస్తోందని స్పష్టం చేశారు.

**పేదలే తొలి ప్రాధాన్యం - పెంచిన పింఛన్లే నిదర్శనం**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే పేదల కోసం పనిచేస్తోందని, దానికి పెంచిన పింఛన్లే నిదర్శనమని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి తొలి నెల నుంచే పింఛన్లను పెంచి అందిస్తున్నామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను ఒకేసారి రూ.1,000 పెంచి రూ.4,000 చేశామని, దివ్యాంగులకు రూ.6,000కు పెంచామని గుర్తు చేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఆరోగ్య పింఛన్లను రూ.10,000, రూ.15,000కు పెంచామని వివరించారు. 2024 జూలై నుంచి ఇప్పటివరకు పింఛన్ల రూపంలో రూ.65,887 కోట్లు అందించామని, ఏడాదికి ఈ ఒక్క పథకం కోసమే దాదాపు రూ.32 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల రాష్ట్రవ్యాప్తంగా 62.34 లక్షల మందికి రూ.2,729 కోట్లు పంపిణీ చేస్తున్నామని, దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదని అన్నారు.

**సంక్షేమంతో పాటు అభివృద్ధి, ఉపాధి**

పేదరికం లేని సమాజాన్ని చూడాలన్నదే తన కల అని చంద్రబాబు అన్నారు. కేవలం పింఛన్లే కాకుండా 'తల్లికి వందనం', 'స్త్రీశక్తి', 'అన్నదాత సుఖీభవ' వంటి అనేక పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, చేనేతలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గడిచిన 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, తద్వారా 23 లక్షల ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాకినాడ సమీపంలో రూ.80 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ, అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వంటివి యువతకు ఉపాధి మార్గాలు చూపుతాయని అన్నారు.

**ప్రాంతీయ అభివృద్ధి.. పోలవరం పూర్తి**

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. శ్రీకాకుళం నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి వరకు విశాఖ రీజియన్‌గా, పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం వరకు అమరావతి రీజియన్‌గా, తిరుపతి కేంద్రంగా రాయలసీమ రీజియన్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. 2027లో గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తామని, ఆ లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ కాలువ పనులను జూలై నాటికి పూర్తి చేసి నీరందిస్తామని చెప్పారు. మత్స్యకారుల కోసం రూ.240 కోట్లతో 200 మెకనైజ్డ్ బోట్లను సబ్సిడీపై అందిస్తామని, అమినాబాద్ ఫిషింగ్ హార్బర్ కోసం రూ.80 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు.

**సుపరిపాలనే ధ్యేయం.. కలిసికట్టుగా ముందుకి**

ప్రజలకు నాణ్యమైన పౌరసేవలు అందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే 'వాట్సప్ గవర్నెన్స్' ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని చెప్పారు. '2047 స్వర్ణాంధ్ర విజన్'తో రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. ఈ యజ్ఞంలో మిత్రుడు పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కాకినాడ జిల్లాలో పౌరసేవలు సంతృప్తికరంగా అందించిన ప్రభుత్వ యంత్రాంగాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**